


# స్పర్శ

ఇ.టి. రామారావు

వాచీ చూసుకున్నాను!

ట్రెయిన్ బయల్దేరడానికి యింకా పది నిమిషాల టైముంది.

బ్రీఫ్‌కేస్ సీట్లో పెట్టి కంపార్ట్‌మెంటులో నుండి దిగి ప్లాట్‌ఫారం మీదకు వచ్చి నిలుచుని సిగరెట్టు ముట్టించాను.

ప్లాట్‌ఫారం నిండా జనం!

ఒకటే హడావిడి, గందరగోళం!

"బాబూ! ఈ బండి గూడూరు వెళుతుంది కదూ?"

ఎవరో ప్రశ్నించడంతో తలత్రిప్పి చూశాను.

దాదాపు అరవైఏళ్ళ వృద్ధుడు! చేతిలో పెద్ద సూట్ కేసు!

వెళుతుందన్నట్టుగా తలవూపాను.

నా దృష్టి అతని వెనుకగా నిలుచుని వున్న యువతిపై బడింది.

పాతికేళ్లు వుంటాయేమో! చాలా అందంగా వుంది. ముఖంలో అమాయకత్వం ప్రతిఫలిస్తూ వుంది. చీరకట్టు, అలంకరణ చూస్తే పెద్దగా చదువుకున్నట్టు అనిపించడం లేదు. చేతుల్లో నెలల పసిబిడ్డ!

"ముసలాయన కూతురు కాబోలు!" అనుకున్నాను.

"నాన్నా! ఈ పెట్టెలో ఎక్కుదాం! రైలుబయలుదేరే టైం అయినట్టుంది" అన్నది ఆ యువతి తండ్రితో.

"పదమ్మా!" అంటూ ఆ కంపార్టుమెంటులోకి ఎక్కాడు ఆ వృద్ధుడు. తండ్రిని అనుసరించి తనూ అందులోకి ఎక్కింది ఆ యువతి.

గార్డు విజిల్ వేశాడు.

గబగబా కంపార్టుమెంట్‌లోకి ఎక్కి నా సీటు దగ్గరికి నడిచాను.

ఇందాక ఎక్కిన ఆ వృద్ధుడు, యువతి యిద్దరూ నాకు ఎదురుగా వున్న సీట్లో సర్దుకుని కూర్చుని వున్నారు.

ట్రెయిన్ బయలుదేరింది.

ఆ ముసలాయన నా వంక చూస్తూ, "బాబూ! ఈ బండి తెల్లారేటప్పటికి చేరుకుంటుందా?" అని అడిగాడు.

"ఆరుగంటలకంతా చేరుకుంటుందనుకుంటాను." అని జవాబు చెప్పి మ్యాగజైన్ చేతుల్లోకి తీసుకున్నాను.

నా కళ్లు అక్షరాల వెంట పరుగులు తీస్తున్నా అప్పుడప్పుడు తలెత్తి ఎదురుగా కూర్చున్న ఆ తండ్రీ కూతుళ్ల వంక చూస్తూనే వున్నాను.

ట్రెయిన్ తెనాలి స్టేషన్లో ఆగి మళ్లీ బయలుదేరింది.

కంపార్ట్‌మెంట్‌లో చాలా మంది నిద్రలోకి జారుకున్నారు.

నాకు నిద్రరావడంలేదు. సీట్లో వెనక్కి జారగిలి పడుకుని కళ్లు మూసుకుని ఆలోచనల్లోకి వెళ్లాను.

కొద్ది క్షణాల్లో నా ఆలోచనలను భగ్నం చేస్తూ సన్నగా ఏడుపు వినిపించసాగింది. నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాను.

ఆ యువతి నోటికి కొంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తూంది. ఆమె తండ్రి ఆమెను సముదాయిస్తు న్నాడు.

"ఏడవకమ్మా! నీ కాపురానికి ఏం భయంలేదు. అల్లుడికి వచ్చజెప్పి నిన్ను ఆ యింట్లో దించే పూచీనాది! భయపడకు."

నా దృష్టి అతని వెనుకగా నిలుచుని వున్న యువతిపై పడింది. పాతికేళ్ళు వుంటాయేమో! చాలా అందంగా వుంది. ముఖంలో అమాయకత్వం ప్రతిఫలిస్తూ వుంది. చీరకట్టు, అలంకరణ చూస్తే పెద్దగా చదువుకున్నట్టు అనిపించడం లేదు. చేతుల్లో పసిబిడ్డ!

ఒక్క క్షణం ఓరగా ఆ తండ్రీ కూతుళ్ళ వంక చూశాను. తండ్రి భుజం మీద తల వాల్చి పడుకొని వుందా యువతి. ఆమె చెక్కిళ్ళపై జాలువారుతున్న కన్నీటి చారికలు. నెల్లూరు స్టేషన్ రాగానే నేను దిగాను. వాళ్ళింకా మంచి నిద్రలో వున్నారు. క్షణం వాళ్ళ వంక చూసి స్టేషన్ బయటికి నడిచాను. ఆ మరుసటిరోజే నేను మళ్ళీ విజయవాడ ప్రయాణమయ్యాను.

మనసుని ప్రభావితం చేయడానికి సుదీర్ఘ అనుభవాలే కారణం కానక్కరలేదు. ఒక చిన్న సంఘటన చాలు.

ఎంత వద్దనుకున్నా వాళ్ల సంభాషణ నా చెవులకి సోకుతూనే వుంది.

"నీదంతా భ్రమనాన్నా! ఆయన ఎంత డబ్బు మనిషో నాకు తెలుసు. పసిబిడ్డ తల్లినని కూడా చూడకుండా ఇన్ని నెలలు నన్ను పుట్టింట్లో వదిలేసి ఏమీ పట్టనట్టు వూరుకున్న ఆయన మీ మాటలకు లొంగిపోతాడా? డబ్బు లేకుండా మళ్లీ ఆ గడప తొక్కొద్దని శాసించాడు. అలాంటి మనిషి దగ్గరకు మళ్లీ నన్ను పంపిస్తారా? వద్దు నాన్నా! నేను మీ దగ్గరే వుంటాను."

తండ్రి భుజం మీద తల వాల్చి వెక్కివెక్కి ఏడుస్తున్నది ఆ యువతి. నాకెందుకో ఆ సంభాషణ మీద ఆసక్తి పెరిగింది. నేను వాళ్లని గమనిస్తున్నానని వాళ్లకు తెలియకుండా వుండడం కోసం కళ్లు మూసుకున్నాను. చెవులు మాత్రం వాళ్ల మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్నాయి.

"ఆడపిల్ల భర్తని వదిలి ఎంతకాలం పుట్టింట్లో వుండగలదు తల్లీ! నువ్వు నాకు భారం కాకపోయినా లోకాన్ని గురించి భయపడాలి కదా! కష్టమో నష్టమో భరిస్తూ నువ్వు అతని దగ్గర వుండడమే సబబు. ఇక డబ్బంటావా? కొద్ది రోజులు గడువివ్వమని ప్రాధేయపడతాను. ఈ ముసలి తండ్రి కన్నీళ్లు అతని మనసుని కరిగించక పోవులే తల్లీ!"

ఉబికి వస్తున్న కన్నీటిని పై గుడ్డతో తుడుచుకుంటూ అన్నాడు ఆ వృద్ధుడు.

తండ్రి ఆవేదన చూసి తల్లడిల్లి పోయినట్టుంది ఆ యువతి!

"ఈ వయస్సులో నా కారణంగా మీకెన్ని కష్టాలు నాన్నా!" బాధగా వినిపించింది ఆమె కంఠం.

"ఆడపిల్ల తండ్రిగా యివన్నీ తప్పవు తల్లీ! నువ్వుబాధపడకు." ఆ వృద్ధుడు కూతురిని సముదాయిస్తున్నాడు.

విషయం ఏమిటో నాకు చాలా వరకు బోధపడింది ఆ సంభాషణ ద్వారా!

అప్రయత్నంగా నా మనసులో ఏదో కలవరం మొదలైంది!

"నా కాపురం గురించి నేను బాధపడడంలేదు నాన్నా! నా ఆవేదనంతా మీ గురించే! డబ్బు తీసుకురాకుండా మీరు నన్ను వెంటబెట్టుకుని వచ్చారని తెలిసిన మరుక్షణం ఆయన మిమ్మల్ని ఎన్ని అనరాని మాటలంటాడో, ఎంతగా అవమానపరుస్తాడో వూహించుకుంటేనే నేను భరించలేకపోతున్నాను."

ఆ యువతి కంఠం ఆవేదనతో జీరపోయింది.

ఆ వృద్ధుడు నిర్లిప్తంగా నవ్వడం కంటికొనల్లో నుండి గమనించాను.

"అవమానం అనుకుంటే ఎలా తల్లీ! అల్లుడే కదా! నాలుగు మాటలంటాడేమో! అననీ! అంతమాత్రాన నాకొచ్చే నష్టం ఏముంది చెప్పు! నన్ను అవమాన పరిచినా ఫర్వాలేదు. నిన్ను స్వీకరిస్తే నాకదే చాలు." నెమ్మదిగా అన్నాడు ఆ వృద్ధుడు.

నా మనసుని ఎవరో పిండుతున్నట్లు అనిపించసాగింది.

ఆ వృద్ధుడు మళ్లీ మాట్లాడసాగాడు.

"నా కొక్క ఆరు నెలలు గడువిప్పిస్తే చాలమ్మా! ఈ ఆరు నెలల్లో ఎన్ని కష్టాలైనా పడి, ఎంత శ్రమకైనా ఓర్చి ఆ డబ్బు జమచేస్తాను. రాత్రింబవళ్లు కూలిపని చేసో, రిక్షాలాగో సంపాదిస్తాను. అప్పటికీ సర్దుబాటు కాకపోతే మిగిలిన బాకీ చెల్లుబాటు కోసం అల్లుడింట్లో వూడిగం చేస్తాను. నీ కోసం, నీ కాపురం కోసం నేను ఎంత కష్టమైనా భరించగలను తల్లీ!"

తండ్రి మాటలకు ఆ యువతి కుమిలికుమిలి ఏడవసాగింది.

నా కెందుకో కళ్లు విప్పి వాళ్లవంక చూడాలనిపించడంలేదు.

కొద్ది నిమిషాల్లో రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

కాఫీ దొరుకుతుందేమోనని ప్లాట్‌ఫారం మీదికి చూశాను. అలాంటి ఛాయలేవీ అక్కడ కనిపించలేదు.

తిరిగి సీట్లో వాలి కళ్లు మూసుకుంటూ ఒక్కక్షణం ఓరగా ఆ తండ్రీ కూతుళ్ల వంక చూశాను.

తండ్రి భుజం మీద తలవాల్చి పడుకుని వుంది ఆ యువతి!

ఆమె చెక్కిళ్లపై జారువాలుతున్న కన్నీటి చారికలు!

నెల్లూరు స్టేషన్ రాగానే నేను దిగాను.

వాళ్లింకా మంచి నిద్రలో వున్నారు. ఇంకో అరగంటలో గూడూరు చేరుకుంటారు. ఒక్క క్షణం వాళ్లవంక చూసి స్టేషన్ బయటికి నడిచాను.

మరుసటి రోజే నేను మళ్లీ విజయవాడ ప్రయాణమయ్యాను...

కట్నం డబ్బులు పూర్తిగా తీసుకొచ్చిందాకా తిరిగి రావద్దని శాసించి పుట్టింట్లో వదిలి వచ్చిన నా భార్య ఇందిరను వెంటబెట్టుకు రావటానికి!

మనసుని ప్రభావితం చేయడానికి సుదీర్ఘ అనుభవాలే కారణం కానక్కరలేదు.

ఒక చిన్న సంఘటన చాలు!

నా మనసుని ప్రభావితం చేసి నాలో పరివర్తనకు కారణం అయిన ఆ తండ్రీకూతుళ్లను నేనెప్పటికీ మరచిపోలేను. ●



నటి అనూ అగ్రవాల్‌కి రహస్య ఫ్రెంచి ప్రియుడున్నాడు. అందగాడైన ఈ ఫ్రెంచ్ యువకుడికి రెస్టారెంట్లు, ఆర్ట్ గ్యాలరీలు ఇంకా ఎన్నో వ్యాపారాలు ఉన్నాయట. ఇతగాడి పేరు 'లారెంట్‌రోస్'. 'నా ప్రియుడు రొమాంటిక్‌గా, సెక్సీగా వుంటాడు. అందుకే అతనిని మోహించాను'అంటోంది అనూ. —కృష్ణాజీ

